క్లుప్తంగా

ఎన్టీఆర్ స్మారక నాణేం విడుదలపై హర్షం



ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లి: దివంగత సీఎం ఎన్టీఆర్ జయంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ఆమోదంతో ముద్రించిన రూ.100 స్మారక నాణేన్ని రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా విడుదల చేయడం పట్ల సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య హర్షం వ్యక్తం చేశారు. తెలుగు సినిమా ప్రస్తావన వస్తే మొదటిగా చెప్పుకునే పేరు నందమూరి తారక రామారావు అని.. తెలుగు ప్రజలకు సేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చి ముఖ్యమంత్రి అయ్యారని, ఎన్నో ప్రజాహిత కార్యక్రమాలతో ప్రజాభిమానం పొందారని ఎమ్మెల్యే గుర్తు చేశారు.

సంపద వనాల పెంపకానికి స్థలసేకరణ



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ వేణుమాధవ్

ఏన్కూరు: మండలంలోని రాయమాదారం, తూతకలింగన్నపేట గ్రామాల్లో (సంపద వనాల) మొక్కల పెంపకానికి.. ఎంపీడీఓ వేణుమాధవ్ సోమవారం స్థలసేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంపద వనాలను గుర్తించి అందులో ఎర్రచందనం మొక్కలు వేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సూరయ్య పాల్గొన్నారు.

చేపల పెంపకంపై శిక్షణ

ముదిగొండ: మండలంలోని ఖానాపురంలో పండ్రేగుపల్లి, ఖానాపురం, న్యూలక్ష్మీపురం గ్రామాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ రైతులకు సోమవారం చేపల పెంపకంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ ఏడీ ఆంజనేయస్వామి మాట్లాడుతూ.. చేపల పెంపకంతో ఆర్థికంగా ఉపాధి పొందవచ్చునని అన్నారు. కార్యక్రమంలో ఎంపీఈడీఏ జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ డాక్టర్ బంగారమ్మ, ఎంపీఈడీఏ కోఆర్డినేటర్ కిరణ్‌లు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

మధిర: సిరిపురం గ్రామ శివారులో సోమవారం పేకాట స్థావరంపై మధిర రూరల్ ఎస్సై ఎండీ ఉపాతుల్ రఫీ ఆధ్వర్యంలో దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.4,300 నగదు, 5 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది నాగరాజు, శంకర్, దశరథ్ ఉన్నారు.

బీమా చెక్కు అందజేత

ముదిగొండ: మండలంలోని గంధసిరికి చెందిన వడ్డేపూడి సత్యనారాయణ ఇటీవల మృతి చెందాడు. ముదిగొండ సొసైటీ కార్యాలయంలో రైతు భార్య మహాలక్ష్మికి రూ.50 వేలు విలువైన బీమా చెక్కును ముదిగొండ సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండస్వామి సోమవారం అందించారు. కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు భాషకు గొడుగు పట్టిన గిడుగు

సత్తుపల్లి: తెలుగులో వెలుగులు నింపడానికి గిడుగు రామ్మూర్తి చేసిన కృషి మరువలేనిదని తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ గ్రహీత వెంకటరమణమూర్తి అన్నారు. సోమవారం స్థానిక విశ్వశాంతి విద్యాలయంలో.. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. భాష ఔన్నత్యాన్ని తెలియచేసే విధంగా పాటలు, పద్యాలు, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం వెంకటరమణమూర్తిని పాఠశాల యాజమాన్యం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పుసుపులేటి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. అనేక కవితలు, రచనలతో రమణమూర్తి తెలుగు భాషాభివృద్ధికి పాటు పడుతున్నారన్నారని, అలాంటి ఆయనకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కడం అభినందనీయమన్నారు.

పాలాభిషేకం

ఏన్కూరు: మిని అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా గుర్తించినందుకు స్థానిక కేంద్రంలో సోమవారం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో అమరనేని సుశీల, అరుణ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైగా ఎంపికైన శ్యాంప్రసాద్‌కు సన్మానం

బోనకల్: మండలంలోని జానికీపురం గ్రామానికి చెందిన పంజి శ్యాంప్రసాద్ ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన ఫలితాల్లో ఎస్సైగా ఎంపికయ్యాడు. దీంతో ఆయనను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఖమ్మం పార్లమెంటరీ అధ్యక్షుడు వాసిరెడ్డి రామనాథంలు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సత్యనారాయణ, హనుమంతరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సాగు.. భలే బాగు



న్యూలక్ష్మీపురం అంగన్‌వాడీ కేంద్రంలో పెంచుతున్న పెరటితోట

అంగన్‌వాడీల్లో సేంద్రియ సాగు

- ఖాళీ స్థలంలో కూరగాయలు, ఆకుకూరల పెంపకం
- బాలింతలు, గర్భిణులకు పోషకాహారం

ముదిగొండ: మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు.. పోషకాహారానికి నిలయాలుగా మారుతున్నాయి. కేంద్రాల్లోని మూడేళ్లలోపు చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు ఆరోగ్యకరమైన పోషకాహారం అందించాలన్న లక్ష్యంతో స్త్రీ శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పెరటితోటల పెంపకం ఆదర్శంగా నిలుస్తుంది. కేంద్రాల్లో ఏర్పాటు చేసిన న్యూట్రీగార్డెన్‌లో కూరగాయాలు, ఆకుకూరలు సేంద్రియ పద్ధతిలో పండిస్తున్నారు.

సేంద్రియ పద్ధతిలో లాభాలు..

పంటల సాగు వలన కేంద్రాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొనడంతో పాటు తాజా కూరగాయలు అందివస్తున్నాయి. సేంద్రియ పద్ధతిలో ఆకుకూరలు, కూరగాయలు, ఎరువులతో పండిస్తున్నారు. వాటిని కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులకు ఆహారంతో పాటు అందిస్తున్నారు. తద్వారా లభించే పోషకాలపై గర్భిణులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ విధానం మంచి సత్ఫలితాలను అందిస్తుంది. ముదిగొండ మండలంలో 83 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. అందులో 342మంది గర్భిణులు, 261 మంది బాలింతలు, 1,745 మంది 7నెలల నుంచి 3సంవత్సరాల పి ల్లలు, 1431 మంది 3 నుంచి 6సంవత్సరాలలోపు పిల్లలు ఉన్నారు.

కళకళలాడుతున్న అంగన్‌వాడీలు..

ఆయా అంగన్‌వాడీ కేంద్రల ఆవరణలో ఖాళీ స్థలాలు ఉన్నచోట న్యూట్రీ గార్డెన్‌లు ఏర్పాటు చేశారు. స్థలాలు లేని చోట టెర్రస్ పైన కుండీలు, బకెట్లలో పెంపకానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీల్లో టీచర్లు, ఆయాలు పాలకూర, బచ్చలికూర, మెంతికూర, కరివేపాకు, గోంగూర వంటి ఆకుకూరలతో పాటు బెండ, వంగ, సొర, బీరకాయ వంటి కూరగాయలను సేంద్రియ పద్ధతిలో పెంచుతున్నారు. వీటితో పాటుగా పలు చోట్ల పండ్ల మొక్కలు కూడా పెంచుతున్నారు. దీంతో ప్రతీ అంగన్‌వాడీ కేంద్రం పచ్చని తోటల నడుమ కళకళలాడుతోంది.

పోషకాహార లోప నివారణకు కృషి..



అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఖలీస్థలంలో కూరగాయలు, ఆకుకూరలను పండిస్తున్నాము. ఇక్కడ సాగైన కూరగాయలనే వండిస్తున్నాం. ఎలాంటి రసాయనాలను వాడకుండా.. కేవలం సేంద్రియ ఎరువులనే వాడుతున్నాం. దీంతో పోషకాహర లోప నివారణకు కృషి చేస్తాం.

– పి.శోభ, అంగన్‌వాడీ టీచర్, న్యూలక్ష్మీపురం

సేంద్రియ సాగు చాలా బాగుంది..



అంగన్‌వాడీలో సేంద్రియ సాగు చేపట్టడం చాలా బాగుంది. ఈ సాగుతో ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటుగా మంచి పోషకాలున్న, తాజా కూరగాయలను అందుబాటులో ఉంటాయి. ప్రస్తుత కాలంలో ప్రతి వస్తువులో కల్తి ఉంటుంది. అలాంటి వాటిని తినడం వలన ఆరోగ్యం దెబ్బతింటుంది. కల్తీని నివారించేందుకే కూరగాయలను పెంచుతున్నాం.

– కనపర్తి కుమారి, అంగన్‌వాడీ టీచర్, సువర్ణాపురం

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం



మాట్లాడుతున్న సంభాని చంద్రశేఖర్

కల్లూరు: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. కల్లూరులో సోమవారం పార్టీ మండల అధ్యక్షుడు పెద్దబోయిన దుర్గాప్రసాద్ అధ్యక్షతన బూత్ ఏజెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ గెలుపునకు గ్రామాల్లో ఇప్పటినుంచే ప్రచారం నిర్వహించాలని బూత్ లెవల్ ఏజెంట్లకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికల్లో అభ్యర్థుల విజయానికి బూత్ ఏజెంట్ల పాత్ర కీలకమన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోను గడపగడపకు చేరవేయాలన్నారు. కష్టపడి పని చేసే ప్రతి కార్యకర్తకు పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు వీరభద్రం, రాష్ట్ర ఎస్సీ సెల్ విభాగం కన్వీనర్ కిరణ్‌కుమార్, పీసీసీ సభ్యుడు మనోహర్‌రెడ్డి, జెడ్పీటీసీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, మండల యూత్ అధ్యక్షులు వంశీ, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు సీతారాములు, కృష్ణారెడ్డి, పుల్లారావు, జనార్దన్, చోటో, కృష్ణ, సత్యం, చుక్కా, అఫ్రోజ్, సమీర్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో ఆదరణ పెరిగింది..



తల్లాడ: కాంగ్రెస్ మేనిఫెస్టోను వివరిస్తున్న మట్టా దయానంద్

తల్లాడ: కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి ఆదరణ పెరిగిందని జిల్లా కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ అన్నారు. సోమవారం తల్లాడలో పలువురు మిల్లు యజమానులు, కార్మికులను కలిసి కాంగ్రెస్ మేనిఫెస్టోను వివరించారు. కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని, ప్రజలు పార్టీని ఆదరించాలని తెలిపారు. కార్యక్రమంలో తల్లాడ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు దగ్గుల నాగిరెడ్డి, నాయకులు శివకుమార్‌నాయక్, వీరారెడ్డి, వెంకటేశ్వరరావు, మల్లిఖార్జున్, రామారావు, అప్పల్‌రాజు, భరత్, హరీష్, కృష్ణయ్య, సత్యంబాబు, నరసింహారావు, జోసఫ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల విస్తృత ప్రచారం..

కారేపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో టీపీసీసీ సభ్యుడు దారావత్ రామ్మూర్తినాయక్ ఆధ్వర్యంలో నాయకులు విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు మంజుల, మండల అధ్యక్షుడు చంద్రప్రకాశ్, నాయకులు గోపాల్‌నాయక్, వెంకటేశ్వర్లు, భద్రునాయక్, మనియార్, శ్రీనివాసరావు, ఓంప్రకాశ్‌బూబ్, జగన్నాథం, బాలు, శివాజీ, రాందాస్, కృష్ణ, బాలకృష్ణ, జోగ్యా, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సోనియమ్మ సారె చీరల పంపిణీ ..



కారేపల్లి: మేకలతండాలో చీరలు అందిస్తున్న బాలాజీనాయక్

కారేపల్లి: మండలంలోని మేకలతండా, దుబ్బతండా గ్రామాల్లో గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా.. కిసాన్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బానోత్ బాలాజీనాయక్ ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా.. శ్రావణమాసంలో ఆడపడుచులకు సోనియమ్మ సారె పేరుతో చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యువజన జిల్లా అధ్యక్షుడు సంతోష్, నాయకులు అప్సర్, హర్షానాయక్, రమేష్, పాషా, గణేష్, సాయికిరణ్, రమేష్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పాలకుల విధానాలపై ఉద్యమించాలి



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి

సత్తుపల్లిరూరల్: సంస్కరణల పేరుతో విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణకు పూనుకున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై అమరుల స్ఫూర్తితో ఉద్యమించాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి పాండురంగారావు, జాజిరి శ్రీనివాస్ అన్నారు. 2003లో జరిగిన విద్యుత్ ఉద్యమంలో పోలీసుల తూటాలకు అసువు బాసిన రామకృష్ణ, విష్ణువర్ధన్, బాలస్వామి వర్ధంతి సభ స్థానిక రావి వీరవెంకయ్య భవన్‌లో సీపీఐ(ఎం) పట్టణ, రూరల్ కమిటీల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యమ అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణకు పూనుకోవడం కాని, విద్యుత్ చార్జీలను పెంచాలని చూస్తే ఊరుకోనేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి రావుల రాజబాబు, నాయకులు కుమారస్వామి, సనందన్‌రావు, కృష్ణ, శ్రీను, రాము, మారేశ్వరి, పద్మ, కనకరత్నం, వెంకటనర్సమ్మ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



బోనకల్: రూ.5 వేల నగదు అందజేస్తున్న మర్సకట్ల సంజీవరావు

బోనకల్: బోనకల్ మండలంలోని ముష్టికుంట్ల గ్రామానికి చెందిన మత్స్య సహకార సంఘం సభ్యుడు దొప్ప వీరబాబు కుమారుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో మర్సకట్ల సంజీవరావు వారి కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో సహకార సంఘ అధ్యక్షుడు శ్రీను, కార్యదర్శి సీతారాములు, డైరెక్టర్లు దూబ భద్రాచలం, కొమ్మినేని శేషగిరి,దొప్ప ప్రసాదు, లక్ష్మయ్య, కొరివి పాల్గొన్నారు.

విద్యార్థినికి..

ముదిగొండ: ముదిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో 978మార్కులు సాధించి టాపర్‌గా నలిచిన గంటల ఈశ్వరికి దాతలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా చెరుకూరి జనార్ధన్, మాధాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రామ్మోహన్‌రావులు తలా రూ.5 వేలు అందించగా.. ఖమ్మం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు కృష్ణవేణిలు రూ.5 వేలు విలువైన దుస్తులు అందించారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం విద్యార్థిని అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎర్రుపాలెం: మండలంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మండల విద్యుత్ ఏఈఈ జి.అనూష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని సబ్‌స్టేషన్ పరిధిలోని ఎర్రుపాలెం, పెద్ద గోపవరం, జమలాపురం, మీనవోలు, రేమిడిచర్ల ఫీడర్ల పరిధిలోని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.


కృత్రిమ గర్భధారణతో మేలుజాతి దూడలు



పుట్టిన ఆడదూడతో వెటర్నరీ డాక్టర్ మమత, సర్పంచ్ పద్మ, రైతులు

కల్లూరు రూరల్: కృత్రిమ గర్భధారణతో మేలుజాతి దూడలు జన్మిస్తాయని కల్లూరు వెటర్నరీ డాక్టర్ మమత తెలిపారు. ఈ మేరకు కల్లూరు మండలంలోని ఎర్రబోయినపల్లి గ్రామంలో 'సెక్స్ సార్టెడ్ సెమిన్'అనే ఇంజక్షన్ ఇవడంతో ఆడదూడ జన్మించింది. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నూతనంగా వచ్చిన హెచ్‌ఎఫ్, ముర్రా సహివాల్ జెర్సి వీర్యం అందుబాటులో ఉంచామని తెలిపారు.

మిట్టపల్లిలో ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తల్లాడ: మండలంలోని మిట్టపల్లి గ్రామంలో సోమవారం కాంగ్రెస్ నాయకులు కొండూరి సుధాకర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కోలాట నృత్యాలు చేస్తూ.. సుధాకర్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంగాపురం గ్రామంలో పలు కుటుంబాలను పరామర్శిచారు. కార్యక్రమంలో మండల నాయకులు వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, రమేష్, నరసింహారావు, రామారావు, యూకాబ్‌పాషా, చింటూ, రామక్రిష్ణ, లచ్చిరెడ్డి, నర్సిరెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశానికి తరలిన నాయకులు

ఎర్రుపాలెం: మధిర పట్టణంలో సోమవారం జరిగిన కాంగ్రెస్ పార్టీ ఆత్మీయ సమావేశానికి.. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు ప్రతాపరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు బైక్ ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిల నాయకత్వంలో జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మరింతగా బలోపేతం అవుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహారావు, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసరావు, పిచ్చిరెడ్డి, నర్సిరెడ్డి, నారాయణ, లక్ష్మణరావు, ఉమామహేశ్వరి, బాబురావు, వెంకటనర్సయ్య, రాజీ వ్‌గాంధీ, వెంట్రామిరెడ్డి, రంగారావు తదితరులు ఉన్నారు.

పేదింటి ఆడపడుచులకు అండగా కేసీఆర్



కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రాములునాయక్

వైరా: పేదింటి ఆడపడచులకు సీఎం కేసీఆర్ అండగా ఉన్నారని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ అన్నారు. సోమవారం స్థానిక పాతతండా రైతు వేదికలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైరా, కొణిజర్ల, కారేపల్లి మండలాలకు చెందిన 76 మంది లబ్ధిదారులకు రూ.76,08,816 ల కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లకు సంబంధించిన చెక్కులు ఆయన అందించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతీ ఇంటి పెద్దకొడుకుగా ఆడపిల్లలకు మేనమామలా సీఎం కేసీఆర్ పెండ్లి ఖర్చులు అందజేస్తున్నారని తెలిపారు. ఇలాంటి మరిన్నీ పథకాలు అందాలంటే రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలన్నారు. వైరా తహసీల్దార్ కేవీ శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయా మండలాల తహసీల్దార్లు యర్రయ్య, వి.సురేష్, ఎంపీపీ పావని, జెడ్పీటీసీ కనకదుర్గ, మున్సిపల్ వైస్ చైర్మన్ సీతారాములు, కారేపల్లి ఎంపీపీ శకుంతల, షేక్ లాల్‌మహ్మద్, కృష్ణార్జునరావు, బుజ్జి, మురళీ కృష్ణ, ఉమాశంకర్, చిరంజీవి, వెంకటేశ్వర్లు, రవి తదితరులు పాల్గొన్నారు.

పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరిక



పార్టీలో చేరిన వారితో జెడ్పీ చైర్మన్ కమల్ రాజ్

మధిర: తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన ప్రజలు బీఆర్ఎస్‌లోకి చేరుతున్నారని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ అన్నారు. మండలంలోని వంగవీడు గ్రామంలో గ్రామ సర్పంచ్ బొగ్గుల పద్మావతి వీరారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నుంచి 30 కుటుంబాలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి జెడ్పీ చైర్మన్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కమల్ రాజ్ మాట్లాడుతూ.. కేసీఆర్‌ను నమ్మి ప్రజలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గుర్రం రామారావు, నాయకులు నాగేశ్వరరావు, నరేందర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

సత్తుపల్లిరూరల్: నిరుపేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి జాజిరి శ్రీనివాస్ అన్నారు. సోమవారం స్థానిక రావి వీరవెంకయ్య భవన్‌లో నిర్వహించిన సీపీఐ(ఎం) మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. తుంబూరులోని సర్వే నంబరు 34లో ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించుకొని సాగు చేస్తున్నారన్నారు. ఆ భూమిని స్వాధీనం చేసుకొని ఇళ్లు లేని నిరుపేదలకు పంచాలన్నారు. అలాగే సదాశివునిపాలెంలో ప్రభుత్వ భూమి ఉన్నప్పటికీ పేదలకు పంచడం లేదన్నారు. గృహలక్ష్మి పథకం ఎంపికలో రాజకీయ జోక్యం లేకుండా చూడాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడు పాండు రంగారావు, పట్టణ కార్యదర్శి రాజబాబు, సనందరావు, కుమారస్వామి, కృష్ణ, రాము, శ్రీను, సత్యావతి, మారేశ్వరి, పద్మ, వెంకటనర్సమ్మ పాల్గొన్నారు.

కొణిజర్ల యువకుడికి సేవారత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న ఉపేందర్‌రావు

కొణిజర్ల: మానసిక దివ్యాంగులైన చిన్నారుల కోసం హైదరాబాద్‌లో ప్రత్యేక పాఠశాల నిర్వహిస్తున్న కొణిజర్లకు చెందిన దొండ ఉపేందర్‌రావు జాతీయ సేవారత్న అవార్డుకు అందుకున్నాడు. పూణేలో గ్లోబల్ స్కాలర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయనకు పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ గిరీష్ ప్రభు అవార్డు అందజేశారు. ఆయనను సర్పంచ్ సూరంపల్లి రామారావు, గ్రామస్తులు అభినందించారు.

క్రమశిక్షణతో చదవాలి

సత్తుపల్లిటౌన్: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉత్తమ లక్ష్యాలను సాధించాలని ఎస్సై కుశ, నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్‌లు పేర్కొన్నారు. సోమవారం సత్తుపల్లిలోని శ్రీ నారాయణ ఎంసెట్ అకాడమీ కళాశాలలో ఎంసెట్ కోచింగ్‌లో ప్రతిభ చూపిన శశాంకకు, సింధుశ్రీలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఎన్ సీహెచ్ రామకృష్ణమాచార్యులు, మదర్ థెరిస్సా కళాశాల కరస్పాండెంట్ నాయుడు వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ రాజా, డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు గొడుగులు వితరణ



గొడుగులు అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

వైరా: వైరా గ్రేటర్ విజన్ లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలు ఉండ్రు వరలక్ష్మి ఆధ్వర్యంలో పల్లిపాడు, వైరాకు చెందిన చిరువ్యాపారులకు సోమవారం గొడుగులు వితరణ చేశారు. 7 మందికి గొడుగులు అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులకు చిరువ్యాపారులు ధన్యవాదాలు తెలిపారు. తమకు ఎండా, వాన నుంచి ఈ గొడుగులు రక్షణగా ఉంటాయని వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీ లగడపాటి ప్రభాకర్‌రావు, తోటకూర శ్రీకాంత్, గంగవరపు కిషన్‌రాయ్, ఉయ్యూరి రామకృష్ణ, జాలా మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువుకు గండి.. నీరు వృథా



గండి పడి వృథాగా పోతున్న నీరు

చింతకాని: చింతకాని నల్లచెరువు తూము వద్ద ఉన్న కాలువకు గండి పడటంతో నీరు వాగుకు వృథాగా పోతుంది. దీంతో ఆయకట్టుకింద సాగుచేసిన వరి పొలాలకు నీరు అందడంలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ అధికారులకు తెలిపినా.. వారు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి వృథాగా పోతున్న చెరువు నీటిని అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

వెంకటలక్ష్మికి పొంగులేటి నివాళి

కొణిజర్ల: మండలంలోని పెద్దమునగాల సర్పంచ్ పరికపల్లి శ్రీనివాసరావు మాతృమూర్తి వెంకటలక్ష్మి మృతికి ఖమ్మం మాజీ ఎంపీ, టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు మువ్వా విజయ్‌బాబు, బానోత్ విజయాబాయి, బొర్రా రాజశేఖర్, మలీదు జగన్, షేక్ ముస్తాఫా, గుమ్మా రోశయ్య, వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, శ్రీనివాసరావు, ఎంపీపీ మధు, పుల్లయ్య కోటేశ్వరరావు పాల్గొన్నారు.

శాంతమ్మ మృతికి..

చింతకాని: మండలంలోని కొదుమూరు గ్రామానికి చెందిన సీపీఐ మండల నాయకురాలు నారపోగు శాంతమ్మ (80) అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. మృతదేహాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందరావు, మండల కార్యదర్శి మల్లికార్జున్‌రావు, జిల్లా సమితి సభ్యుడు రవి సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీతయ్య, సత్యనారాయణ, సతీష్, కొండలరావు, వసంతరావు, కొండలరావు, వీరబాబు, ఎంపీటీసీ హేమ తదితరులు పాల్గొన్నారు.

వైరా టికెట్ ఎరుకులకు కేటాయించండి



సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్కకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వైరా: ఎస్టీ రిజర్వుడ్ అయిన వైరా నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా ఎరుకుల కులానికి చెందిన పాలకుర్తి నాగేశ్వరరావుకు కేటాయించాలని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైరా నియోజకవర్గంలో నాలుగుసార్లు ఎన్నికలు జరగ్గా ఒక్కసారికూడా ఎరుకలకు టిక్కెట్ కేటాయించలేదన్నారు. పార్టీకి, ప్రజలకు సేవలందిస్తున్న పాలకుర్తి నాగేశ్వరరావుకు టికెట్ కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ఎరుకుల సంఘం అధ్యక్షుడు శ్రీరామ్ ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు మూకర ప్రసాద్, పుట్టబాతి వెంకటరమణ, దుగ్గిరాల సామేలు, ఎలివేసు, రమణ, ప్రకాశ్, జాకోబు, మహేష్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.